క్లుప్తంగా

జాతీయ ఫైరింగ్ పోటీలకు వంశీ ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: చెన్నైలో ఈ నెలాఖరులో జాతీయస్థాయిలో జరగనున్న ఫైరింగ్ పోటీలకు టీజేపీఎస్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన బీకాం తృతీయ సంవత్సర విద్యార్థి కె. వంశీ జాతీయి స్థాయికి ఎంపిక కావడం గర్వకారణని పేర్కొన్నారు. విద్యతో పాటు ఎన్‌సీసీలో చురుగ్గా పాల్గొనే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతుండటంతో జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి వంశీని కె.వి. బ్రహ్మంతో పాటు కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి. కుమార్‌రాజా, వైస్ ప్రిన్సిపాల్ పి. భానుమురళి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.వి. సుధీర్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

అద్దె బకాయిల వసూలుపై స్పెషల్ డ్రైవ్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు కోట్ల రూపాయల్లో పెండింగ్‌పై అదనపు కమిషనర్ కె. రాజ్యలక్ష్మి సీరియస్‌గా ఉన్నారు. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్న షాపుల నుంచి ఈ నెల 26వ తేదీలోగా బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్స్, రెవెన్యూ ఆఫీసర్స్, డిప్యూటీ కమిషనర్స్‌కు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 500 దాకా షాపులు ఉన్నాయి. వీటిల్లో సుమారు రెండు కోట్ల రూపాయలకు పైచిలుకు బకాయిలు పేరుకుపోయాయి. వీటి వసూలుకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను రాజ్యలక్ష్మి ఆదేశించారు. ప్రతి రోజు సాయంత్రం వసూళ్లపై రివ్యూ మీటింగ్ నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్లను ఆమె ఆదేశించారు.

అనాథ ఆశ్రమానికి వాషింగ్ మిషన్ వితరణ



గుంటూరు మెడికల్: అల్బీనా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటుకూరులోని పిల్లల అనాథ ఆశ్రమానికి వాషింగ్‌మిషన్‌ను బుధవారం వితరణగా అందజేశారు. ట్రస్టు సభ్యుల సహకారంతో పిల్లలకు వాషింగ్‌మిషన్ అందజేశామని నిర్వాహకులు జాలాది సెల్వరాజ్ తెలిపారు.

26న బీజేపీ అభ్యర్థులకు అభినందన

గుంటూరు మెడికల్: ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలుపొందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులకు ఈనెల 26న విజయవాడలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు యలవర్తిపాటి పాండు రంగ విఠల్ బుధవారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు వెన్యూ కన్వెన్షన్‌లో జరిగే అభినందన సభలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పేదలకు చీరల పంపిణీ

తెనాలిఅర్బన్: పేదలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పినపాటి రవీంద్ర, ఎన్‌టీఆర్ జగన్‌ఆధ్వర్యంలో బోసురోడ్డులో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మైలా బుజ్జి పాల్గొన్నారు.

భవిత కేంద్ర విద్యార్థులకు కిట్ల అందజేత

అద్దేపల్లి(భట్టిప్రోలు): నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో కొత్తగా గుర్తించిన దివ్యాంగులను బుధవారం చేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాపట్ల జిల్లా సమ గ్ర శిక్ష సీఎంఓ ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బడికి పోతా కార్యక్రమం జూలై 12వ తేదీ వర కు నిర్వహిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐఎస్‌సీ కో–ఆర్డినేటర్ సత్యసాగర్, భవిత కేంద్రం ఐఈఆర్టీ రత్నాకర్, ఫిజియోథెరపిస్ట్ శరత్, సీఆర్పీ సలోమి పాల్గొన్నారు.

విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేత

జిలుగువారిపాలెం(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను బుధవారం పంపిణీ చేశా రు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్దన్, ఎస్ఎంసీ చైర్మన్ గుండాల ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి 'పొగ'



డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పుతో వ్యాపిస్తున్న పొగ

- డంపింగ్ యార్డులో తరచూ చెత్తకు నిప్పు
- కాలుష్యంతో నతమతమవుతున్న ప్రజలు

పొన్నూరు: పట్టణంలో సేకరించిన చెత్తను నిల్వ చేయడం పెద్ద సమస్యగా మారుతోంది. 31 వార్డులకు సంబంధించి ఇంటింటి నుంచి సేకరించిన టన్నులకొద్దీ చెత్తను నిడుబ్రోలులోని డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. ఆ తర్వాత పునర్వినియోగం చేయడంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు విఫలమవుతున్నారు. వార్డుల నుంచి ప్రతిరోజు సుమారు 28 టన్నుల చెత్త సేకరిస్తారు. దాదాపు 18 టన్నుల చెత్తను జిందాల్ కంపెనీకి తరలిస్తామని అధికారులు చెబుతున్నారు. డంపింగ్ యార్డులో నిల్వచేసిన చెత్తను జిందాల్ కంపెనీకి తరలించే ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత రెండు నెలలుగా నిలిచిపోయింది. దీంతో వందల టన్నుల చెత్త డంపింగ్ యార్డుకే పరిమితమైంది. గుట్టలుగా పేరుకున్న చెత్తకు కొందరు నిప్పు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో చెత్తకు మంటపెట్టడంతో వ్యాపిస్తున్న పొగ కారణంగా ప్రజలు కాలుష్యం బారినపడుతున్నారు. రేపల్లె , పొన్నూరుకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో వాహనదారులు అధిక సంఖ్యలో ఆ రోడ్డున ప్రయాణం సాగిస్తుంటారు. వీరు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి డంపింగ్ యార్డులో నిల్వలు కదలకపోవడంతో పట్టణంలో కూడా ఇంటింటి చెత్త సేకరణకు అడ్డంకిగా మారింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోజుల తరబడి చెత్త సేకరణ విషయాన్ని పారిశుద్ధ్య విభాగ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడికక్కడ వీధుల్లో గుట్టలుగా దర్శనమిస్తోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం

డంపింగ్‌యార్డులో చెత్తను కాల్చకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో చెత్త తరలింపులో అంతరాయం ఏర్పడింది. వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం.

–తిరుమలశెట్టి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొన్నూరు

అందరి ఆరోగ్య పరిరక్షణకు కృషి



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యసిబ్బంది

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గరుడాచలపాలెంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి దోమకాటు వల్ల వచ్చే రోగాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు చెప్పారు. వారంలో ఒకసారి 'ఫ్రైడే– డ్రైడే' కార్యక్రమంలో నీరు నిల్వ ఉండే గాబుల శుభ్రత గురించి చెబుతున్నారని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత, మురుగు కాలువల్లో నీటి పారుదల సక్రమంగా ఉండేలా తగిన జాగ్రత్తలు చెప్పారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఎంపీహెచ్ మేల్ బాబావలి, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదత్తసాయి ప్రేమమందిర ప్రతిష్ట వార్షికోత్సవం



సత్కారం అందుకున్న విద్వాంసులతో వెంకటేశ్వరరావు

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం ప్రతిష్ట వార్షికోత్సం బుధవారం ఘనంగా ఆరంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం ఆరు గంటలకు పతాకావిష్కరణ చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలను జరిపించారు. ఉదయం 8 గంటల్నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదాయ భజనలు నిర్వహించారు. భజనల అనంతరం హైదరాబాద్‌కు చెందిన సంపత్‌కుమార్‌తో సంకీర్తనలు జరిగాయి. అనంతరం సంపత్‌కుమార్, వాద్య సహకారం అందించిన మోదుకూరు నగధర్‌కుమార్, ఆంజనేయశాస్త్రిని నిర్వాహకుడు కొర్రపాటి వెంకటేశ్వరరావు సత్కరించారు. ఈమనిలోని శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, కొర్రపాటి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహన



చుండూరు గురుకుల పాఠశాలలోని వసతి గృహంలో మలాథియన్ స్ప్రే చేస్తున్న సిబ్బంది పక్కన అధికారులు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా మలేరియా కార్యాలయాధికారి జి.రాంబాబు, బాపట్ల పట్టణ హెల్త్ సెంటర్, స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది పాఠశాలను సందర్శించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహంలోని అన్ని గదులలో దోమల నివారణకు మలాథియాన్, లార్వా సైడ్ మందులను స్ట్రిప్ పంపుల ద్వారా ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ చేశారు. అలాగే వంట శాలలోని గదులను, వంట పాత్రల పరిశుభ్రత, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, వసతి గృహం ఆవరణలో నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీనారాయణతో చర్చించారు. అదే విధంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి దోమ కాటు వలన వచ్చే కీటకజనిత వ్యాధులను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక వైద్యశాలలో సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని కోరారు. వంట పాత్రలపై మూతలు తప్పని సరిగా ఉంచాలని డయేరియా, వాంతులు, విరోచనాలు, పచ్చకామెర్ల వంటివి నీరు, ఆహారం, ఈగలు ద్వారా ప్రబలుతాయని వివరించారు.

ఏటా కోతకు గురవుతున్న లంక భూములు

- రేవులో కలిసిపోతున్న ఖైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద కోతకు గురవుతున్న నివాస గృహాలు(ఫైల్)

భట్టిప్రోలు: ప్రతి ఏటా కృష్ణానదీ పరీవాహక లంక గ్రామాల రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గతంలో అడపా దడపా లంక గ్రామాలకు వరద ముంపు పొంచి ఉండేది. నాలుగైదేళ్లుగా ప్రతి ఏటా వరదలు ముంచెతుత్తున్నాయి. దీంతో రైతులు బిక్కుబిక్కుమంటూ దేవునిపై భారం వేసి సాగుకు సమాయత్తమవుతున్నారు. పంటలు ఈ ఏడు కాకపోతే మరసటేడు ఐనా పుష్కలంగా పండి తమ కష్టాలు గట్టెక్కుతాయనే ఆశతో సాగుచేస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం పక్కనే ఉన్న రేవులో వరద ఉధృతికి పంట భూములు కోతకు గురవుతున్నాయి. పల్లెపాలెం వద్ద 10 మందికి రైతులకు చెందిన 30 ఎకరాల పంట భూమి ఉండగా అది నేడు 15 ఎకరాలకు చేరిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. పెదపులివర్రు, గొరిగపూడి, రేపల్లె ప్రాంతాలకు చెందిన రైతుల పంట పొలాల్లో పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయల పంటలను పండిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

బాపట్లటౌన్: పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని గంగా పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం వా ర్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజా కా ర్యక్రమాలు సాయంత్రం వరకు నిర్వహించా రు. స్వామికి శివస్తోత్రం, లలితా సహస్రనామ పారాయణం , గోపూజ, విశేష అభిషేకం, స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించటం, సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొల్లిపర ప్రసాద్, గూడూరు చిట్టిబాబు, సాయివెంకట్, పంగులూరి కౌండిన్య, భీమవరపు సురేష్, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, నెమలికంటి హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యా కానుక పంపిణీ

తెనాలిరూరల్: పట్టణ గంగానమ్మపేటలోపి తోటకూర సుబ్బారావు నాయుడు మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ గొడవర్తి హరేరామ్, పాఠశాల దాత తోటకూర వెంకట రమణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని కిట్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థితికి రావాలని విద్యార్థులకు సూచించారు.

విద్యుత్ సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

తెనాలిరూరల్: విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే సంబంధిత కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని విద్యుత్ డీఈఈ వీవీ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి తెనాలి పట్టణం, మండలం, చేబ్రోలు, చుండూరు, దుగ్గిరాల, భట్టిప్రోలు మండలాల్లో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగాయని, తీగలు తెగాయని చెప్పారు. వీలైనంత వరకు మరమ్మతులు అప్పటికప్పుడే చేపట్టామని, మిగిలిన పనులను బుధవారం కొనసాగించినట్లు చెప్పారు. విద్యుత్ మరమ్మతులు చేయాల్సిన అవసరముంటే సంబంధిత విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలి : కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: వర్షం నీరు మురుగు కాలువలోకి వెళ్లే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 32వ వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి అక్కడక్కడ నీరు నిలబడి ఉండటాని గమనించిన ఆయన వాటిని బయటకు పంపే విధంగా చూడాలని సూచించారు. పట్టణంలోని డ్రెయిన్లు వర్షం నీటితో నిండి ఉండటాని గమనించిన ఆయన పారుదల జరిగే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళి



ఐలవరం(భట్టిప్రోలు): హిందూ సామ్రాజ్య దినోత్సవం పురస్కరించుకుని ఎస్ఎస్ఎఫ్ భట్టిప్రోలు మండలం ఐలవరంలో బుధవారం ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, సహ కన్వీనర్ వి.కోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ ఎం.రంగారావు, పి.నాగులు, జి.జగన్‌మోహన్‌రావు, డి.శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ కె.వాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చండి



తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తెనాలి మండల విద్యాధికారి–2 వి.జయంతి బాబు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని బుధవారం చెంచుపేటలో నిర్వహించారు. బడి– ఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు నుంచి 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరూ బడిలో చేరే విధంగా చూడటమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. బడి మానేసిన పిల్లలనే తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా చూస్తామన్నారు.

ధూళిపాళ్ల ఫ్యామిలీ ఓవర్ యాక్షన్

- ఇంట్లోనే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ భార్య జ్యోతిర్మయి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

పొన్నూరు: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫ్యామిలీ అధికార దర్పాన్ని ప్రదర్శించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ భార్య జ్యోతిర్మయి ప్రభుత్వ పరంగా ఏ హోదా లేనప్పటికీ మంగళవారం గుంటూరు జిల్లా చింతలపూడి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ ఇంట్లోనే పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలు పాఠశాలల్లోనే నిర్వహించాలి. అయితే ఏ హోదా లేనప్పటికీ విద్యార్థులనే తమ ఇంటికి పిలిపించుకుని పుస్తకాలు పంపిణీ చేయడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే పుస్తకాలు తామే ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పేద విద్యార్థులను కించపరిచే విధంగా ధూళిపాళ్ల ఫ్యామిలీ పుస్తకాలు పంపిణీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏపీ పీజీఈ సెట్ ఫలితాల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



డి.రసజ్ఞ



డి.సాయికృష్ణ



బి.ఇందిర



రత్నశ్రీ



సీహెచ్. హర్షవర్ధన్



జి.ఉమా మహేశ్వరరావు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీఈ సెట్ 2024 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఎంఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షకు కళాశాల నుంచి 70 మంది హాజరుకాగా.. 67 మంది అర్హత పొందటమే కాకుండా 200లోపు ర్యాంకులు ఆరుగురు సాధించారన్నారు. అందులో డి. రసజ్ఞ 32వ ర్యాంక్, డి సాయి కృష్ణ – 88, బీ ఇందిర – 115, జీ ఉమామహేశ్వర రావు – 160, చెరుకూరి హర్ష వర్ధన్, రత్నశ్రీలు 211వ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణలు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని సూచన



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ చౌడవరం సెక్టార్ సూపర్‌వైజర్ బి. జ్యోతి సూచించారు. బుధవారం చౌడవరం గ్రామంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్వంగా ప్రతి ఇంటికి వెళ్లి తల్లులకు వివరాలను వెల్లడించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం షాలిని, ఎంఎస్‌కె బి.మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీరాంజమ్మ, టీచర్ శోభరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణకుమారి, ధనలక్ష్మి, హేమలత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డ గ్రామంలో...

జొన్నలగడ్డ గ్రామంలోని మెయిన్ ఏరియా సెంటర్‌లో బుధవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ జరిగింది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్‌లు మాలతి, జ్యోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్త జీవరాశుల్లోనూ భగవంతుడు



ప్రవచనం చేస్తున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై బుధవారం భగవద్గీతలోని జ్ఞాన యోగంపై సువీరానందస్వామి బుధవారం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సువీరానందస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో మాట్లాడుతూ సూర్యచంద్రుల్లోని కాంతిని, వేదాల అన్నింటిలో ఓంకారం తానే అన్నారని తెలిపారు. పురుషుల్లో పౌరుషం, అగ్నిలో తేజస్సు, తాపసులలో తపస్సును కూడా తానే అని పేర్కొన్నారని వివరించారు. సమస్త జీవ రాశులలో తాను ఉన్నానని భగవాన్ శ్రీకృష్ణుడు తెలిపారని భక్తులకు బోధించారు.

జీజీహెచ్‌లో కాలిన గాయాల బాధితులకు ప్రత్యేక వార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో కాలిన గాయాల బాధితులకు ప్రత్యేక వార్డును కేటాయిస్తున్నట్లు సూరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఎన్టీఆర్ యూనివర్సిటీలో డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ సుమితా శంకర్ జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యం అందించే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఆధునిక, సంక్లిష్టమైన ఆపరేషన్‌లు చేసి ఆసుపత్రికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. త్వరలోనే కమర్షియల్ క్యాంటిన్ స్థానంలో కాలిన గాయాల బాధితులకు చికిత్స వార్డును కేటాయించి 20 పడకలు అందుబాటులోకి తీసుకుని వస్తామని చెప్పారు. ఈ వార్డులో అన్ని వసతులు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అనుబంధంగా కేటాయిస్తున్నామని తెలిపారు. జనరల్ సర్జరీ విభాగం వైద్యుల సహకారం తీసుకుని ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయి గా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు.

డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేరిన పిల్లలు



తెనాలిరూరల్: రోడ్ల వెంబడి నివసించే చెత్త ఏరుకునే కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులను దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో చేర్పించారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో చెత్త ఏరుకుని రోడ్డు వెంబడి నివసిస్తున్న వారిని డీబీఆర్‌సీ ప్రతినిధులు గుర్తించారు. ఇద్దరు విద్యార్థినులను స్థానిక సీఎం కాలనీలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్‌వీరికి అడ్మిషన్‌ఇచ్చారు. డీబీఆర్‌సీ ట్రెనింగ్ కోఆర్డినేటర్ హేమలత, గుంటూరు డివిజనల్ కోఆర్డినేటర్ రవితేజ విద్యార్థినులను పాఠశాలకు తీసుకెళ్లారు.

ఇంకా వాననీటిలోనే బస్టాండ్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ బస్టాండ్ చిన్న పాటి వర్షానికి నీటితో నిండిపోతుంది. బస్టాండ్ ఆవరణ పల్లంగా ఉండటం, అక్కడక్కడ గుంతలు ఉండటంతో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మంగళవారం సాయంత్రం, రాత్రి వేళల్లో తెనాలిలో భారీ వర్షం కురిసింది. దీంతో బస్టాండ్ ఆవరణ మొత్తం వర్షం నీటితో నిండిపోయింది. నీరు మోకాలు లోతు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆవరణలోని నీరు బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com